# ముజఫర్‌నగర్

## మరో మానని గాయం

డెమాక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ రిపోర్ట్

తెలుగు అనువాదం : **ఆర్. శశికళ**

విప్లవ రచయితల సంఘం

మిుజఫర్‌నగర్

మరో మానని గాయం

MUZAFFARNAGAR
Maro Maanani Gayam

డెమాక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ రిపోర్ట్, ఢిల్లీ.

అనువాదం : ఆర్. శశికళ


విరసం ప్రచురణలు
Website : www.virasam.in
Mail : arunatara1977@gmail.com
http://www.facebook.com//arunatara.virasam

మొదటి ప్రచురణ : జూన్, 2014
వెల : 20/-
డిటిపి : ఆర్. భాగ్యలక్ష్మి



చిరునామా :
**పి.వరలక్ష్మి**
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా - 516 360.



ప్రతులకు :
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్.
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్
హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

# ముజఫర్‌నగర్ మతవర్గ రాజకీయాలు

హిందుత్వ రాజకీయ శక్తులకు ఈసారి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ నెత్తుటి ప్రయోగశాల అయింది. రెండు దశాబ్దాల క్రితం ఇదే ఉత్తర్‌ప్రదేశ్‌లో బాబ్రీ మసీదును కూల్చిన శక్తులు అంతకంతకూ బలపడి వేళ్ళూనుకుంటున్నాయి. గుజరాత్ మారణకాండ వాటికి ఆశించిన ఫలితాలనిచ్చింది. అప్పుడు హిందుత్వ శక్తులకు నమూనాగా కనపడిన గుజరాత్ నేడు దేశానింతా ఆదర్శమై అందలమెక్కి ప్రగతి గురించి ప్రగల్భాలు పలుకుతున్నది. ఇప్పుడు వాళ్ళ కత్తులకు రెండు వైపులా పదును. ఒక వైపు పాలకవర్గ అభివృద్ధి నమూనా, మరోవైపు మతం. జీన్స్ ప్యాంట్ల పైన కాషాయ చొక్కాలు ధరించి, నుదుటి బొట్టుతో ఖరీదైన సెల్‌ఫోన్లు పట్టుకొని తిరిగే సంకర సంస్కృతి దేశం మీద దాడి చేస్తోంది. అది మతోన్మాద ముఖంపై అభివృద్ధి ముసుగు ధరించి, న్యాయస్థానాల్లో నెత్తుటి మరకలు కడిగేసుకుని మళ్ళీ కొత్తగా, అవే పాత కత్తులు, త్రిశూలాలతో కుత్తుకలు కోస్తున్నది.

క్షీణ సంస్కృతి, విలువలు, పురుషాధిపత్యం, హింసోన్మాదం పెచ్చులిర్లిపోయిన మన దేశంలో ఎప్పుడూ ఏదో ఒక మూల నిరంతరం జరుగుతున్న ఘటనల్లో ఒక ఘటన ముజఫర్‌నగర్ జిల్లాలో జరిగింది. ఒక అమ్మాయిని ఒక అబ్బాయి అల్లరి పెట్టాడు. ఆ అమ్మాయి సోదరులు ఆవేశంతో అతన్ని కొట్టి చంపారు. ఆ తర్వాత వాళ్ళిద్దరిపైనా అటువైపు వాళ్ళు మూకుమ్మడిగా దాడి చేయడంతో వారు చనిపోయారు. ఇరుపక్కల వాళ్ళు వేరువేరు మతాలకు చెందిన వారు కావడం మతోన్మాద శక్తులకు కలిసి వచ్చింది. ఇది మినీ గోద్రాగా సంఘ్‌పరివార్ శక్తులకు అందివచ్చింది.

2013 ఆగస్టులో కవాల్ గ్రామంలో జరిగిన ఈ సంఘటనను

ఎప్పటినుండో సిద్ధం చేసుకున్న మూకుమ్మడి జాతిహనన ప్రణాళికను అమలు చేయడానికి చురుకుగా వాడుకున్నారు. హిందూ స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందని, ముస్లింలపై ప్రతీకారం తీర్చుకొమ్మని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఇవి జరుగుతున్నంత సేపూ ప్రభుత్వం నిశ్శబ్దంగా కూర్చుండి పోయింది. హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు, లూటీలు అప్రతిహతంగా కొనసాగుతున్నప్పుడే ఒక నకిలీ వీడియోను ఇంటర్‌నెట్‌లోకి ఎక్కించారు. పోలీసులు దాన్ని బ్లాక్ చేసేలోగా అది కార్చిచ్చులా వ్యాపించింది. 2010లో పాకిస్థాన్‌లో ఎవరో దొంగలు ఇద్దరిని హత్య చేస్తున్న విడియోను ఎడిట్ చేసి ముస్లింల గుంపు ఒక అమ్మాయిని అల్లరి పెడుతుండగా అడ్డుకున్న హిందూ యువకుల్ని (ఆమె వాళ్ళ సోదరి అని ప్రచారం చేశారు) చంపుతున్నట్లుగా దాన్ని తయారు చేశారు. ఈ వీడియో మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ ద్వారా విపరీతంగా పాకిపోయింది. ఈ ప్రచారంలో మీరుట్ జిల్లా సర్ధానా నియోజకవర్గ బిజేపీ ఎమ్మెల్యే థాకూర్ సంగీత్ సింగ్ సోమ్ కూడా పాల్గొన్నట్లు తెలిసింది. ఆయన తన ఫేస్‌బుక్‌లో ఈ విడియో పెట్టి (షేర్ చేసి) ముజఫర్‌నగర్‌లో ఏం జరుగుతోందో చూడండని రాశాడు. దైనిక్ జాగరణ్ పత్రిక కూడా నిజానిజాలు విచారించకుండా ఈ వీడియో నుండి రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడి శవం చుట్టూ ముస్లిం సమూహం నిలబడి ఉన్న ఫోటోను ఒకదాన్ని తీసి లోకల్ ఎడిషన్‌లో వేసింది.

దాడులు మీరట్, ముజఫర్‌నగర్, షామ్లి జిల్లాల్లోని 94 గ్రామాలకు పాకాయి. హిందూ స్త్రీల గౌరవాన్ని రక్షించండని పిలుపునిచ్చిన వాళ్ళు ముస్లిం స్త్రీలపై మూకుమ్మడి అత్యాచారాలు చేశారు. అధికారిక లెక్కలు అల్లర్లలో ఎనభై మంది చనిపోయినట్లు అంచనా వేశాయి. యాభైవేల నుండి లక్ష మంది దాకా ముస్లింలు పల్లెలు వదిలి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయారని వివిధ నిజనిర్ధారణ నివేదికలు తెలుపుతున్నాయి. స్కూళ్ళకు పోయివచ్చిన పిల్లలకు ఇళ్ళ స్థానంలో బూడిద కుప్పలు దర్శనమిచ్చాయి. చెల్లాచెదరైన వాళ్ళలో కొందరి ఆచూకీ ఎప్పటికైనా తెలిసే అవకాశం ఉండకపోవచ్చు.

అట్లా నిస్సహాయంగా పారిపోయిన వాళ్ళు తాత్కాలిక టెంట్లతో వేసిన కాంపుల్లో దయనీయంగా బతుకులీడుస్తున్న సమయంలో మన ఘనత వహించిన పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. మెజారిటీ మత రాజకీయాలు ఎంత

శక్తివంతంగా వేళ్ళూనుకున్నాయంటే కనీసం ఎన్నికల సమయానయినా వీళ్ళ పక్షాన నిలబడిన పార్టీ లేదు. అన్ని పార్లమెటరీ రాజకీయ పార్టీలు నేరుగానో, పరోక్షంగానో మెజీరిటీ మత రాజకీయాలకు సహకరించాయి. నేరస్తులకు పరోక్షంగా సహకరించిన అధికార సమాజ్‌వాది పార్టీ, క్యాంపుల్లో దుప్పట్లు పంచి మిన్నకుండిన బిఎస్‌పి సహా. ఇక నేరుగా సిక్కుల ఊచకోత, నిశ్శబ్దంగా బాబ్రీ విధ్వంసం చేయించిన కాంగ్రెస్ సరేసరి. రాహుల్ గాంధీ క్యాంపుల్లో ఉన్న వాళ్ళపైనే వివాదాస్పద వ్యాఖ్యలు చేసి నాలిక్కరుచుకున్నాడు.

చాలా విచిత్రంగా కొంపా గోడూ, ఊరూ వల్లకాడూ ఏమీ మిగలకపోయినా క్యాంపుల్లో ఉన్న వాళ్ళకు ఓటు గుర్తింపు కార్డులు మాత్రం అందాయి. దీనిని అపహాస్యం అందామా, ఐరనీ అందామా? ఎందుకంటే కనీసం బూడిద కాకుండా మిగిలిన సామాను, ఇళ్ళను కూడా బాధితులకు దక్కనివ్వలేదు. క్యాంపుల్లో శాశ్వతంగా ఉండలేరు కనక సాహసించి వాళ్ళ ఊర్లకు వెళ్ళిన వాళ్ళు తరిమివేయబడుతున్నారు. ఊర్లలో ఉన్న ఇళ్ళు, పొలాలు చివరికి శ్మశానాలు కూడా ఆధిపత్య జాట్ వర్గాల ఆక్రమణకు గురయ్యాయి. మీరిక ఊళ్ళకు తిరిగి వెళ్ళకపోవడమే మంచిదని పోలీసులు కూడా 'సలహా'లిచ్చారు. 'ప్రజాస్వామ్య' ప్రభుత్వం ఊచకోతను, లూటీలను సాగనిచ్చింది. హంతకులను, రేపిస్టులను స్వేచ్ఛగా తిరగనిస్తున్నది. పైపెచ్చు నిలువనీడ లేకుండా పోయి ఎక్కడో టెంట్లు వేసుకొని బతుకుతున్న వాళ్ళపైనే అటవీ భూమి ఆక్రమించారని కేసులు నమోదు చేసింది. నెలల తరబడి అలా శిబిరాలు ఉండటం, ఎవరెవరో వచ్చి పరామర్శిస్తుండటం ప్రభుత్వానికి చికాకుగా ఉంది. అంతో ఇంతో డబ్బులిచ్చి, పరిహారం అందింది కదా, ఇక ఇక్కడుండొద్దు అని ఖాళీ చేయిస్తున్నది. వాళ్ళూ మెల్లమెల్లగా ఏ కూలిపనుల కోసమో తరాలపాటు వెన్నంటే గాయాల్ని మోసుకుంటూ చెట్టుకొకరు, పుట్టకొకరుగా కదిలిపోతున్నారు.

ఆధిపత్య కులం, మతం విచ్చలవిడి హత్యలు, లూటీలు చేయడానికి నేరమంటని చట్టాలున్న వ్యవస్థ, రాజకీయ భిన్నాభిప్రాయాలున్న వాళ్ళను, ముస్లింలను చంపడానికి అన్ని చట్టాలనూ ఉల్లఘిస్తుంది. అవసరమైతే కొత్త చట్టాలను రచిస్తుంది. అందరికీ కూడూ, గూడూ గుడ్డ ఏమోగాని తమవైన, విశ్వాసాలు కలిగి తమవైన బతుకులు కూడా లేకుండా చేస్తున్న కుహనా

ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడటానికి అందరూ ఓటు వేసేలా జాగ్రత్తలు తీసుకుంది ప్రభుత్వం. జిల్లాలో 20 గ్రామాలను సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించి తగిన ఏర్పాట్లతో ఎన్నికలు నిర్వహించారు. ముజఫర్‌నగర్ క్యాంపుల్లో ఉన్న వాళ్ళు కొన్ని చోట్ల పోలీసు రక్షణ నడుమ ఓటు వేశారు. 'ఎక్కడి నుండో వచ్చి ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని ఉన్నారు. వాళ్ళకిక్కడ ఓటు వేసే హక్కు లేద'ని బీజేపీ అభ్యర్థి హుకుమ్‌సింగ్ వంటి వాళ్ళు అంటే, చెట్టు కింద ఉండే వాళ్ళకు కూడా ఓటు హక్కు ఉంటుందని అధికారులన్నారు.

ఇదిట్లా ఉంటే 12 ఏళ్ళ క్రితం గుజరాత్ మారణకాండకు పెద్ద ఎత్తున స్పందించిన జాతీయ మీడియా, పత్రికలు ఇప్పుడు దాదాపు పూర్తిగా కెమెరాలు తిప్పేసుకన్నాయి. ప్రగతిశీల శిబిరం నుండి ఉండవలసినంతగా ప్రతిస్పందన లేదు. అయితే మునుపటి కన్నా మరింత సంఘటితంగా భావజాల, సాంస్కృతిక రంగాల్లో లౌకికవాద ప్రజాస్వామిక శక్తులు పనిచేయవలసిన అవసరాన్ని ఇటీవలి పరిణామాలు నొక్కి చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ముజఫర్‌నగర్ బాధితులకు సంఘీభావంగా కొంత మంది విద్యార్థులు నిజనిర్ధారణ బృందంగా వెళ్ళి క్యాంపుల్లోని దయనీయ పరిస్థితులను కళ్ళకు కడుతూ జరిగిన సంఘటనల క్రమాన్ని విశ్లేషణాత్మక నివేదిక రూపంలో ప్రచురించారు. 'ముజఫర్‌నగర్: ది కంటిన్యుయింగ్ వయలెన్స్ ఆఫ్ ఎ కమ్యూనల్ ఫాసిస్ట్ స్టేట్' పేరుతో అది జనవరిలో విడుదలైంది. మతోన్మాద దాడుల వెనక ఉన్న రాజకీయార్థిక కోణాన్ని, రాజ్యం పోషిస్తున్న పాత్రనూ అర్థం చేసుకోడానికి ఈ రిపోర్టు తోడ్పడుతుంది. డెమాక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ ప్రయాత్నాన్ని అభినందిస్తూ తెలుగువారి కోసం ఆ నివేదికను యథాతథంగా అనువదించి ప్రచురిస్తున్నాం.

*–విప్లవ రచయితల సంఘం*

# ముజఫర్‌నగర్

## (పల్లెలపై పడగవిప్పిన మతోన్మాద ఫాసిస్టు రాజ్యహింస)

ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (డి.ఎస్.యు.) నిజనిర్ధారణ నివేదిక

అనువాదం: ఆర్.శశికళ

**పరిచయం :**

ముజఫర్‌నగర్ సహాయ శిబిరాల్లో అసహాయంగా తలదాచుకున్న ప్రజలు గడ్డకట్టించే చలిలో ఎలాంటి అమానవీయ పరిస్థితుల్లో, బతుకుతున్నారో తేటతెల్లం చేస్తూ, 30 మంది పసి పిల్లల మరణాల గురించి మీడియా బయటి ప్రపంచానికి తెలియజేసింది.

ఇటీవల ముజఫర్‌నగర్ ప్రజలు 'గుజరాత్ – 2002 మారణకాండ' వంటి భయానక మతోన్మాద ఊచకోత గాయాలను మోస్తున్నారు.

గత సంవత్సరం 27, ఆగస్టున సచిన్, గౌరవ్ అనే యువకులు చంపబడ్డారు. వారి మృతికి ప్రతీకారంగా ముజఫర్‌నగర్‌లో సంఘటనలు జరిగాయని మీడియాలో తొలుత ప్రచారమైంది. ఒక ముస్లిం యువకుడు ఒక అమ్మాయిని అల్లరి పెడుతుంటే అడ్డుకున్నారనే నెపంతో ఈ సంఘటనలు జరిగాయనే వదంతులు ఉన్నాయి. ఇలాంటి వదంతులు ఆ ప్రాంతంలో వ్యాపిస్తున్నంతలోనే "సంఘ్‌గిరోహ్" (హిందూ మతోన్మాద సంస్థ) పెద్ద ఎత్తున హిందువులను ముస్లింలపై దాడి కోసం సమీకరించింది. హిందూ స్త్రీల గౌరవం కాపాడేందుకు హిందువులంతా ముందుకు వచ్చారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. సెప్టెంబరు 7న ఆ ప్రాంతంలో 18 కాప్ పంచాయితీలతో మహా పంచాయితీ నిర్వహించబడింది. ఆ పంచాయితీ పెద్దలతో పాటు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.ఎల్.ఎ.లు కూడా పాల్గొన్నారు. ఇదంతా జరుగుతూ ఉండగానే లోపల్లోపల ఆర్.ఎస్.ఎస్. / బిజెపి / విహెచ్‌పి / భజరంగ్ దళ్ కార్యకర్తలు గ్రామస్తులను ముస్లింలపై దాడులు జరిపేందుకు సంసిద్ధం చేసారు.

ఎస్.పి, ప్రభుత్వ యంత్రాంగం ఈ దారుణాన్ని పసిగట్టినా దాన్ని ఆపేందుకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. మహా పంచాయితీ జరిగిన తర్వాత హిందూ మతోన్మాద ఫాసిస్టు మూకలు పెద్ద ఎత్తున అత్యాచారాలు, దోపిడి, దహనాలు, హత్యాకాండకు పాల్పడ్డారు. గ్రామాల్లో మిగిలిన వారిని ఒక్కరినీ వదలకుండా, బలవంతంగా రిలీఫ్ క్యాంపులకు తరలించారు.

శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధిత ముస్లింలకు సంఘీభావంగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (ఢిల్లీ), బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, అలాహాబాద్ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు, వీరితో పాటు ఒక స్వతంత్ర జర్నలిస్టు సహా 12 మంది సభ్యుల బృందం జనవరి 4న షామిలీ జిల్లాలోని మలక్‌పూర్, నూర్‌పూర్ కుర్గాం, అక్బర్‌పూర్ సునేతి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంపులను సందర్శించి, శరణార్థులతో మాట్లాడి ఈ నివేదికను తయారు చేసింది.

దాడులకు గురైన గ్రామాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలో రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసారు. ఆ దారుణ సంఘటనలు జరిగిన నాలుగు నెలల తర్వాత కూడా, ఆ గాయాలు కళ్ళకు కట్టినట్లు వారినింకా వేధిస్తూ వెంటాడుతూనే ఉన్నాయి. విద్యార్థుల నిజనిర్ధారణ కమిటీ అక్కడికి వెళ్ళకముందే అంటే వారం క్రితమే ప్రభుత్వం రిలీఫ్ క్యాంపుల్లో తలదాచుకున్న వారందరినీ ఖాళీ చేసి వారి వారి గ్రామాలకు తిరిగి వెళ్ళాలని నోటీసులు జారీ చేసింది. ఆ క్యాంపుల దగ్గరికి వెళ్ళేటప్పటికే అక్కడి ప్రజలంతా బలవంతపు తరలింపుకు వ్యతిరేకంగా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. విద్యార్థి బృందం క్యాంపులకు చేరుకున్న ముందు రోజు రాత్రి పోలీసులు, స్థానిక పాలనా యంత్రాంగానికి చెందిన వారు శరణార్థులు క్యాంపులను ఖాళీచేసి వెళ్ళిపోవాలని బెదిరించారు. క్యాంపులకు సమీప ప్రాంతాల్లో కూలి పనులకు వెళ్ళే మగవాళ్ళంతా ఆ రోజు పనులకు వెళ్ళకుండా దాడి జరుగుతుందనే అనుమానంతో క్యాంపుల్లోనే ఉండిపోయారు. కమిటీ సభ్యులమందరం మలక్‌పూర్ క్యాంపు దగ్గర ఉన్నప్పుడు, ప్రభుత్వ అధికారులు, శరణార్థులందరినీ క్యాంపులు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని బెదిరిస్తున్నారు. ప్రజలు నిరసన తెలిపినప్పటికీ కొన్ని క్యాంపుల నుండి బాధితులను బలవంతంగా ఖాళీ చేయించారు. క్యాంపులను తొలగించారు.

కాండ్ల, షామిలీ ప్రాంతాల్లో ఉన్న మదరసాల్లోని ప్రజలను కూడా అక్కడి నుండి పంపి వేసే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం. అక్కడ తలదాచుకున్న ప్రజలను ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. బాధితులంతా భయోత్పాతంలోనే మగ్గిపోతున్నారు. ప్రజా వ్యతిరేక ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్థానిక ప్రెస్ కూడా తోడయ్యింది.

రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి చెందిన వివిధ శాఖలకు వంత పాడుతూ 'అమర్ ఉజాలా' స్థానిక హిందీ దినపత్రికలో "వాళ్ళంతా అక్రమంగా శిబిరాల్లో తిష్టవేశారనీ, వాళ్ళెవరూ దాడుల్లో బాధితులు కాదని, కేవలం నష్టపరిహారం (రిలీఫ్ మనీ) కోసం ఆశతో అక్కడ ఉంటున్నారు" అని ప్రచురించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ అధికారులు శరణార్థులను వెళ్ళగొట్టడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అక్కడ ప్లాస్టిక్‌తో, టార్పాలిన్‌తో వేసిన డేరాలు చెల్లాచెదురైపోయాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు పడిపోతున్నాయి. అటువంటి గడ్డకట్టే చలిలో ప్రజలు బాధలు పడుతుంటే ముజఫర్ నగర్‌లో జరిగిన దాడులకు సంబంధించి 'జాట్ కులస్తులపై ముస్లింలే దాడులు చేస్తారంటూ' స్థానిక మీడియా అగ్నికి ఆజ్యం పోస్తోంది. ప్రస్తుతం మీడియాలో వస్తున్న కథనాలు వాటికి కొనసాగింపు మాత్రమే. మీడియాలోని కొన్ని సెక్షన్లు 'సంఘ్ గిరోహ్' సంస్థ చేసే అసత్య, అసహ్య ప్రచారాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పోయింది. మలక్‌పూర్ రిలీఫ్‌క్యాంపు ఇన్‌ఛార్జి రెయినుద్దీన్ మాటల్లో "శరణార్థులను తలనొప్పిగా భావిస్తూ, బలవంతంగానైనా వారిని అక్కడి నుంచి తొలగించాలనుకుంటున్నారు". అక్కడ ఉన్న మూడు క్యాంపుల్లో ఇలాంటి మాటలే వినిపిస్తున్నాయి. బయటి నుంచి వచ్చే వాళ్ళతో ఏదో ఆశతో వారి గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ఏదో జరుగుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. అక్కడికి వచ్చే సందర్శకులతో వారి వారి ప్రతిఘటనకు అండగా ఉండమని వేడుకుంటున్నారు. బయటి ప్రపంచానికి వాస్తవ విషయాలు ప్రచారం అయితేనే న్యాయం జరుగుతుందనే ఆశ వారిలో మిణుకు మిణుకుమంటోంది. "బిడ్డలారా! గ్రామాలకు తిరిగి వెళ్ళటంకన్నా ఇక్కడే ఎందుకు చావాలనుకుంటున్నామో మీరైనా తెలుసుకొని మా బాధలను బయటి ప్రపంచానికి వెళ్ళడించండి' అని వేడుకుంటున్నారు.

పౌర సమాజం, అనేక ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నుండి శరణార్థులకు ఆర్థిక సహాయంతో పాటు, దుప్పట్లు లాంటివి అందాయి. కానీ మాకున్న పరిమిత ఆర్థిక వనరుల వలన మేము సహాయం చేయలేకపోయాం. వారి అవసరాలు తీర్చాలంటే ఎంత కష్టమైన విషయమో మాకు అర్థమయింది. వారికి తాత్కాలిక సహాయం అందుతూనే ఉంది కానీ, అది ఏ మూలకు సరిపోతుంది? ప్రధానమైన విషయం వారికి న్యాయం ఎలా జరుగుతుంది? ఇలాంటి అనేకమైన ప్రశ్నలు మమ్మల్ని వేధిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు న్యాయం, గౌరవం కోసం చేస్తున్న పోరాటానికి మేం కేవలం సంఘీభావం తెల్పుతున్నాం.

వివిధ క్యాంపుల్లో ఉంటున్న బాధితుల అనుభవాలను అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ చిరు నివేదికను రూపొందించాం. అణిచివేత, పీడన లేని సమాజం కోసం పునాది వేసేందుకు జరగబోయే మహత్తర పోరాటంలో భాగం కావాలని, ఈ దాడుల్లో అమరులైన వాళ్ళకు, బతికి బయట పడ్డ వాళ్ళకు న్యాయం జరిగేలా మద్దతు కూడగట్టేందుకు చేసే చిన్న ప్రయత్నమే ఈ నివేదిక.

## క్యాంపుల్లో నెలకొన్న దయనీయ పరిస్థితులు

క్యాంపుల్లోని శరణార్థులతో సంభాషణ వలన – 'వాళ్ళెందుకు అక్కడే ఉండాలనుకుంటున్నారో – ఈ భయోత్పాతం వెనుక దాగిన కుట్ర ఏంటో – వారు తిరిగి తమ గ్రామాలకు వెళ్ళలేని పరిస్థితులు ఏమిటో అర్థమవుతుంది.

మేము సందర్శించిన మూడు క్యాంపుల్లోని బాధితులంతా అక్కడే ఉండాలని తీర్మానించుకున్నారు. కమ్యూనిటీ ఐక్యత వలన గౌరవం, భద్రతతో కూడిన వాతావరణం ఏర్పడింది. ఒకవేళ తిరిగి దాడులు జరిగితే వాళ్ళంతా కలిసి అడ్డుకోగలమనే భరోసా కనపడుతోంది. టార్పాలిన్ టెంట్లు తాత్కాలికమే. పెద్ద గాలి వీచినా తట్టుకోలేవు. ప్రభుత్వ సహాయం అంతంత మాత్రమే. దానితో పోలిస్తే దేశ, విదేశాల్లోని మైనారిటీ సంస్థలు, వ్యక్తులే వారి అవసరాలకు డబ్బులు, బట్టలు, దుప్పట్లు అందిస్తున్నారు. ప్రభుత్వం నామమాత్రంగా కొద్ది మంది పెద్దవాళ్ళకోసం అని ఇచ్చిన శాలువాలు కనీసం వాళ్ళందకీ అందనుకూడా లేదు. ఎముకలు కొరికే చలిని తట్టుకోడానికి పంచిన శాలువాలు ఎస్‌పీ ప్రభుత్వ అసమర్థతనైనా కప్పివేయగలిగేవి కావు.

జనవరి 4వ తేదిన క్యాంపుల్లోని 30-35 మంది పసి పిల్లలు తీవ్రమైన చలి గాలుల బారిన పడ్డారు. వైద్య సౌకర్యాలు అంతంత మాత్రమే. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. టార్పాలిన్‌తో ఏర్పాటు చేసిన గోడలు పైకప్పుకు సరిపోవడం లేదు. రాత్రిళ్ళు 8 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కుటుంబ సభ్యులు నలుగురున్నా, పది మంది ఉన్నా ఆ టెంట్లలో ఇరుక్కోవల్సిందే. టెంట్లన్నీ ఒకే సైజులో ఉన్నాయి. ఇంక వైద్యం గురించి ఎవరికీ పట్టదు. మలక్‌పూర్ క్యాంపులో డాక్టరు రోజుకు ఒక గంట మాత్రమే గడిపేవాడు. అతను కేవలం బ్రూఫిన్, పారాసెటమాల్ బిళ్లలు యిచ్చేవాడు. నిమోనియాకు ఆరుగురు పిల్లల్ని కోల్పోయిన అక్బర్‌పుర, సునేధి క్యాంపులదీ అదే పరిస్థితి. జుబేదా అనే వృద్ధురాలు పసి పిల్లలందరికీ ఒక రకమైన మందులు ఇచ్చిన వైనం గురించి తెలిపింది. కొన్ని సందర్భాల్లో డాక్టర్లు వైద్యం చేయడానికి నిరాకరించి ఏ ప్రభుత్వాసుపత్రికో పొండని చెప్పేసేవాళ్ళు. అవి క్యాంపులకు ఎంతో దూరం.

దాడుల తర్వాత బాధితులు అక్కడ తాత్కాలికంగా టెంట్లు వేసుకున్నారు. ఇది వరకే అక్కడ చెట్లు, పాములు ఉండేవి. పాముల గురించి వారిలో భయం వెంటాడుతూనే ఉంది. అంతేకాక ఆ క్యాంపులకు కేవలం నూరు మీటర్ల వెనుక వైపు చెరుకు తోటలు ఉన్నాయి. శిబిరాల్లోని దయనీయ పరిస్థితులు ఒకవైపైతే మరీ దుర్మార్గంగా ప్రభుత్వ భూములు ఆక్రమించారనీ, అడవులు నరుకుతున్నారనీ అధికారుల ద్వారా క్యాంపులను తొలగించే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం.

షాజద్ సైఫీ (మలక్‌పూర్ క్యాంపు) మాట్లాడుతూ 'మనుషులకంటే అడవులంటేనే ప్రభుత్వానికి ప్రేమ" అని అన్నాడు. మలక్‌పూర్, అక్బర్‌పూర్, సునేధి క్యాంపుల్లో లైట్లు లేవు. గడ్డకట్టే చలిలో, చిమ్మ చీకట్లో బతుకుతున్నారు. రెండో, మూడో కుళాయిలు ఉన్నాయి. మొత్తం నీటి సరఫరా కనీస అవసరాలకు కూడా సరిపోదు. మహిళలు తాగేందుకు వంటకు నీటిని వారి దగ్గరున్న పాత్రల్లో జాగ్రత్తగా నిలువ చేసుకుంటారు. ప్రతి టెంటులో పాత్రలు రెండు కంటే ఎక్కువ ఉండవు. నీటి సరఫరా కుటుంబంలోని సభ్యుల సంఖ్యతో ప్రమేయం లేదు.

మలక్‌పూర్ క్యాంపులో నాలుగు వెలిసిపోయిన దడిలాంటి ప్రత్యేక గదులున్నాయి. మహిళలకు అవి మరుగుదొడ్లు. పిల్లలు, మగవాళ్ల

చెరుకుతోటల్లోకి వెళ్తుంటారు. నాలుగు వెదురు బొంగులు పాతి పైన టార్పాలిన్ వేశారు. అవే స్నానపు గదులు. అక్బర్‌పూర్, సునేధి క్యాంపులు కూడా ఇంచుమించు ఇలానే ఉన్నాయి. నూర్‌పూర్, ఖుర్గమ్‌పూర్ క్యాంపుల్లో పరిస్థితి ఎంతో కొంత మేలు. పక్కా టెంట్లను వెదురు బొంగులు పాతి, ప్లాస్టిక్ షీట్లతో నిర్మించుకున్నారు. లైట్లు ఉన్నాయి. ఒక్కో టెంటులో ఒక బల్బు ఉంది. ఇక్కడ మూడు వందల కుటుంబాలు ఉన్నాయి. ఈ టెంట్లలో అయితే కొంత మేరకు చలిని తట్టుకునే పరిస్థితి ఉంది.

మహిళల పరిస్థితి దయనీయంగా ఉంది. సరైన శుభ్రత, ఆరోగ్య పరిరక్షణ లేక వ్యాధులతో సతమతవుతున్నారు. నూర్జహాన్ (మలక్‌పూర్ క్యాంపు) మాట్లాడుతూ “సానిటరీ నాప్‌కిన్స్ సరిగా అందక, చాలీచాలని బట్టలతో బహిష్టు సమయంలో బాధపడుతున్నాం. కొందరికి గర్భస్రావం లాంటి సమస్యలున్నాయి. గైనకాలజిస్టు, మిడ్‌వైఫ్‌లు లేకుండానే కొందరు స్త్రీలు ప్రసవించారు (ఇతరుల సహాయంతో). చాలా మంది స్త్రీల ఆరోగ్యం క్షీణిస్తూ, బలహీనంగా ఉన్నారు. అప్పుడే పుట్టిన శిశువుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. జనవరి 4వ తేదిన పుట్టిన సుహాని అనే 10 రోజుల చిన్నారి శ్వాస ఆడక రక్తహీనతతో బలహీనంగా ఉంది” అని వివరించింది.

ఉన్న సమస్యలే కాక, వండి పెట్టడం, కుటుంబ పాలన, పోషణ వంటి అదనపు బాధ్యతలతో మహిళలు దుర్భరమైన బతుకులీడుస్తున్నారు. ప్రతి కుటుంబానికి పిండి, పప్పులు, ఆయా సీజన్లలో దొరికే కూరగాయాలు, కాలీఫ్లవర్‌లాంటివి సరఫరా చేస్తున్నారు. కానీ, నీటి కొరత వలన అనారోగ్యకర పరిస్థితుల్లో వంట వండుతున్నారు. మురుగు కాల్వల పక్కనే పిల్లలతో సహా తిరుగుతున్నారు. మహిళలు రోజులో ఒక్కసారే వండుతారు. అది ఆ కుటుంబానికి రోజంతా సరిపోదు. కట్టుబట్టలతో క్యాంపులకు రావడంతో వంటపాత్రలు సరిగా లేవు. చుట్టుపక్కల దొరికే ఆకుల్లోనే భోజనాలు చేస్తున్నారు. మతోన్మాద గాయాల భారం చిన్నారులు మరింత ఎక్కువగా మోస్తున్నారనడానికిని తార్కాణంగా వణికించే చలిలో, చాలీ చాలని బట్టలతో నిమోనియా లాంటి జబ్బుల దగ్గరి నుండి అకాల మరణాల వరకూ పిల్లలు గురవుతున్నారు.

గత సెప్టెంబరులో గ్రామంలో జరిగిన హింసాత్మక సంఘటనల కారణంగా

భయం, షాక్‌ల నుండి ఇంకా కోలుకోలేని ఇద్దరు మహిళలు (లాక్ గ్రామం) వసీలా, అక్బారీ మలక్‌పూర్ క్యాంపులో ఉన్నారు. ఆనాటి సంఘటనల్లో బాధితులు, సాక్షులు, ఇతరుల లాగే వారూ పారిపోయి క్యాంపుల్లో తలదాచుకున్నారు. మతోన్మాద ఫాసిస్టు గ్యాంగులు ముస్లింలను ఎలా ఊచకోత కోసిందీ, ఇళ్ళను, పశువుల కొట్టాలను ఎలా తగులబెట్టిందీ, వారి ఉనికే ఆ గ్రామాల్లో లేకుండా చేసేందుకు ఎలా ప్రయత్నించిందీ కళ్ళకు కట్టినట్టు వివరించారు. వారికి సంబంధించిన ఒక్క వస్తువూ మిగలలేదు. అన్నీ దహనమయ్యాయి. ఆ హింసాకాండతో భయకంపితులైన వాళ్ళు తిరిగి గ్రామాలకు వెళ్ళాలనుకోవడం లేదు. ఇటుకల బట్టీలో దిన కూలీగా పనిచేస్తున్న వసీలా 'అల్లరి మూకలు నా ఇంట్లో జొరబడి బంగారం దొంగలించారు. 10 క్వింటాళ్ళ ధాన్యాన్ని ఇతర సామాగ్రిని ధ్వంసం చేసి ఇంటిని తగలబెట్టార'ని చెప్పింది. అత్యంత క్రూరంగా, దారుణంగా ఆయుధాలతో దాడి చేసిన భయానక ఘటనను వర్ణించి చెప్పింది అక్బారీ అనే మహిళ. జాట్లు ముస్లింలను చెరుకు కోత సమయంలో వాడే ఆయుధాలతో చెట్లను నరికినట్లు విచక్షణా రహితంగా తెగ నరికారు. అంతా చెల్లాచెదురయ్యారు. ప్రాణ రక్షణ కోసం పరుగులు తీయడంతో ఎన్నో కుటుంబాలు చల్లాచదురయ్యాయి. కొన్ని రోజుల తర్వాత, ఒక్కోసారి కొన్ని నెలల తర్వాత, ఆ మారణకాండలో మిగిలినవారు, పిల్లలు, తల్లితండ్రులు క్రమంగా కలుసుకుంటున్నారు. అనేక మందిని చంపేసిన తర్వాత శవాలు ఎక్కడో పారవేయడంతో కనిపించకుండాపోయిన వాళ్ళు ఎంతమంది బతికున్నారో తెలియని స్థితిలో తమ వాళ్ళకోసం మరికొన్ని కుటుంబాలు ఆశతో ఎదురు చూస్తున్నాయి.

బాధితులంతా ముక్తకంఠంతో తెలిపిందేమంటే ఈ దాడులకు పాల్పడిన వారితో పోలీసులు కూడా కుమ్మక్కైయ్యారని. ఒరిస్సాలోని బొలాంగిర్‌లో దళితులపై దాడి జరిగినప్పుడు పోలీసుల ఫోన్లన్ని స్విచ్ ఆఫ్ చేసి ఉన్నట్లే ఇక్కడా అటువంటి కథే. బాధితులు కొందరు ఫోన్ చేసి పోలీసులతో మాట్లాడినప్పటికీ వారు సంఘటనా స్థలానికి రాలేదు. దాడుల తర్వాత కేసుల నమోదులో కూడా నిర్లక్ష్యంగానే ఉన్నారు. పైగా అసలు ఎటువంటి దాడులు, హత్యలు జరగలేదని బుకాయించారు. దాడులు చేసిన వాళ్ళు విచారణ చేసేవాళ్ళు ఒక్కళ్ళే అయినప్పుడు

జరిగే విచారణ ఏముంటుందని బాధితులు స్పష్టంగా చెప్తున్నారు. ఏవైనా కేసులనేవి నమోదై ఉంటే అవి భూస్వాములు, పెత్తందార్లయిన జాట్‌ల పలుకుబడి వల్ల విచారణకు కదలలేదు. పైపెచ్చు బాధితులే నేరస్తులని, దాడులు చేసారని పోలీసులు ఏకపక్ష విచారణ చేస్తున్నారు.

ఇర్షాద్ (మలక్‌పూర్ క్యాంపు) ఈ కుట్రను వివరించారు. నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, నేరస్తులకు నమ్మిన బంట్లే పాలనా యంత్రాంగంలో ఉన్న అధికార్లు కాబట్టి ఒక్కడూ అరెస్టు కాలేదని చెప్పాడు. "మమ్మల్ని చంపిన వాళ్ళు అక్కడ స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటే మేం గ్రామాలకు వెళ్ళేకంటే, ఈ రోడ్లపైనే బతుకుతాం. లేదంటే వాళ్ళు మమ్మల్ని మళ్ళీ చంపొచ్చు" అన్నది బాజిద్‌పూర్ గ్రామస్తురాలు సమీనా. మలక్‌పూర్ క్యాంపులో ఒక వృద్ధురాలు భయపడ్తూ ఇలా చెప్పిందేమిటంటే ఇంకో దాడి జరిగితే ప్రభుత్వమే అందులో భాగమవుతుందని. కొన్ని సందర్భాల్లో దాడులకు గురైన కొన్ని కుటుంబాలు తమ గ్రామాలకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తే బెదిరింపుల వలన ప్రాణభయంతో క్యాంపులకు తిరిగి వచ్చారు. మహమ్మద్ దిల్‌షాబ్ (నూర్‌పూర్ ఖురగామ్ క్యాంపు) మాట్లాడుతూ కుర్మల్ గ్రామ ప్రధాన్ వత్తిడి వలన వారి రెండు కుటుంబాలు గ్రామం చేరుకున్నాయి, కానీ జాట్‌లు పెట్రోల్ క్యాన్‌లతో ఎదురొచ్చి తగులబెడతామని బెదిరించే సరికి తిరిగి క్యాంపుకు చేరుకున్నారు అన్నాడు. మరో సంఘటనలో ముస్లిం కమ్యూనిటీకి చెందిన కొందరు వస్తువులు తెచ్చుకోవడానికి మోటరు సైకిళ్ళపై తమ గ్రామాలకు వెళ్ళినప్పుడు కాడ్కా, 'కుల్బా–కుట్టి' గ్రామాల వద్ద జాట్‌లు, పోలీసులు కలిసి మోటారు సైకిళ్ళను తగులబెట్టారు.

పిల్లలను కోల్పోయిన అనేక కుటుంబాలు క్యాంపులను వదిలి వెళ్ళాయి. కానీ తమ గ్రామాలకు తిరిగి చేరుకోలేదు. గత నవంబరులో షాజాద్ సైఫీ ఐదు నెలల కొడుకు నిమోనియాతో చనిపోయాడు. "తమంతట తాము ఏదైనా ఏర్పాట్లు చేసుకుంటే తప్ప ఈ క్యాంపులు వదిలి ఎవరూ వెళ్ళడం లేదు. అయితే ఎవ్వరూ గ్రామాలకు మాత్రం వెళ్ళడం లేదు. రిలీఫ్ క్యాంపులకు దగ్గరే చిన్న గదులను అద్దెకు తీసుకొని ఉంటున్నారు" అని షాజద్‌సైఫీ చెప్పాడు. షాజద్ కుటుంబం లాక్ గ్రామంలో ఉంటుంది. అతను ఢిల్లీలో ఒక వెల్డింగ్ సంస్థలో పనిచేస్తాడు.

దాడుల వలన చెదిరిపోయిన అతని కుటుంబం క్యాంపుల్లో ఉంటోంది. కొడుకును కోల్పోయిన విషాదాన్ని వివరిస్తూ తడిలేని కళ్ళతో స్థిర చిత్తంతో అతను చెప్పిందేమిటంటే ఇప్పుడిక విచారించగలిగింది బతికున్న వాళ్ళ మనుగడ గురించే అని. అతని చూపులు మమ్మల్ని వెంటాడుతూనే ఉన్నాయి. కుటుంబ సభ్యుల శవ సంస్కారమైనా చేయలేక కనీసం గౌరవప్రదమైన మరణాన్ని లేకుండా చేశామని కట్టలు తెంచుకున్న దు:ఖంతో ఒక మహిళ చెప్పింది. ఆనాటి సంఘటనలు కలిచి వేస్తుంటే ఆమె కుప్పకూలి పోయింది. ఎక్కడ ముస్లింలు మైనారిటీగా ఉన్నారో అక్కడ వారికి రక్షణ లేదన్న భయం వాళ్లలో స్పష్టంగా కనిపించగా ఖురాన్, మదరసాలను ఎలా తగులబెట్టిందీ, మసీదులపై ఎలా దాడులు జరిగిందీ వారు తల్చుకుంటున్నారు.

క్యాంపుల్లో ఉంటున్న మహిళలు వారిపై జరిగిన లైంగిక దాడులు, అత్యాచారాలను వివరించడానికి మొదట ఇబ్బంది పడ్డారు. కొంత సేపటి తర్వాత ఆ భీభత్స భయానక దుర్మార్గాలను, ఆ వికృతమైన దాడులను వివరించారు. అందమైన యువతులను నగ్నంగా తిప్పి గాజు పెంకులపై నృత్యాలు చేయించారు. సామూహిక అత్యాచారాలకు గురైన యువతులు తీవ్రమైన రక్తస్రావంతో, గాయాలతో, ఎన్నో రకాల రోగాలతో వేదనతో బతుకులీడుస్తున్నారు. ఒక మహిళ తన సోదరిని తన కళ్ళ ఎదుటే ఆమె కాళ్ళను విరిచి ఎంత ఘోరంగా చంపేశారో తల్చుకుంటూ వివరించింది. ఎంతో మంది యువతులను అపహరించారు. ఇప్పటికీ వారి జాడ తెలియదు. వాళ్లు బతికే ఉన్నారో లేదో తెలియని పరిస్థితి. జాట్‌లు చిన్న అమ్మాయిలను పెళ్ళాడి వారి నుదిటిపై సింధూరం పెట్టడం, వేధించడం లాంటివి చేసారు. చాలా మందిని బందీలుగా ఉంచుకున్నారు. కాబట్టి గ్రామాల్లో కంటే క్యాంపుల్లో ఉండటమే సురక్షితమని వాళ్ళు భావిస్తున్నారు. ఇక్కడ పోలీసుల వల్ల వారికి ప్రమాదముందని భయపడుతున్నారు. క్యాంపుల్లోని కొంత మంది రాత్రిళ్ళు గస్తీ తిరుగుతుండటం వల్ల మహిళలు కొంత సురక్షితంగా భావిస్తున్నారు.

ఆనాటి మరిన్ని దుర్మార్గాలను గుర్తుచేసుకుంటూ వారి ఎదుటే పిల్లలను చెరుకు కోత మిషన్లలోకి ఎలా విసిరివేసిందీ, మోహల్లాల్లో బహిరంగంగా స్త్రీ పురుషులను ఎలా ఉరేసిందీ వివరించారు. కొందరు జాట్‌లపై ఫిర్యాదు

చేయాలనుకుంటే (అత్యాచారాలు, హత్యల గురించి) పోలీసులు, మహిళా కానిస్టేబుళ్ళతో సహా ఫిర్యాదుదారులను భౌతికంగా హింసించడమే కాకుండా, ముస్లిం యువకులను అక్రమ నిర్బంధంలో ఉంచుకున్నారు. వారిపైనే అత్యాచారం కేసులు పెట్టారు. దాడులను అరికట్టడానికి బదులు ప్రభుత్వం పూర్తి అలసత్వాన్ని ప్రదర్శించింది. పోలీసు యంత్రాంగంలో సగం మందికి పైగా అవినీతిపరులు, జాట్ కులానికి చెందిన వారున్నారు. వీరి పక్కా ప్రణాళికతోనే ఈ దాడులు జరిగాయి. గ్రామాల్లో దాడులు జరుగుతూ ఉంటే పోలీసులు చాయ్ తాగుతూ నిర్లక్ష్యంగా ఉన్న ఘటనలు బాధితుల స్మృతిలో ఇంకా మెదుల్తున్నాయి. బాధితుల రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి రాతపూర్వక హామీనీ ఇవ్వలేదు. కానీ, అధికారులు క్యాంపుల్లో తలదాచుకున్న వారందరినీ బెదిరించి, హడలుగొట్టి ఖాళీ చేయించేందుకు సన్నద్ధమవుతున్నారు. బాధితులు గ్రామాలకు వెళ్ళేందుకు సిద్ధంగా లేరు. "ఎంత చేసినా జాట్‌లకు మామీద కక్ష తీరినట్లు లేదు" అని అమీనా అంటున్న దాన్ని మలక్‌పూర్ క్యాంపు బాధితులంతా పునరుద్ఘాటిస్తున్నారు.

దాడుల ఫలితంగా పిల్లలంతా విద్యకు దూరమయ్యారు. దాడుల భయంతో గ్రామాలకు దూరంగానే ఉన్నారు. క్యాంపుల్లో పాఠశాలలు లేవు. మలక్‌పూర్ క్యాంపులో మాత్రం తాత్కాలిక మసీదు వాతావరణం ఏర్పరుచుకుని మద్రసా తలీమ్ చెప్తున్నారు. నూర్‌పుర్ ఖుర్‌గమ్ క్యాంపులో ఉంటున్న ఒకతను హిందీ టీచరుగా ఉన్నాడు. అక్బర్‌పుర్ సునేధి క్యాంపుల్లో ఇటువంటివి ఏవీ లేవు. ఈ క్యాంపుల్లో ఉంటున్న బాధితులకు పెద్ద ఎత్తున ప్రాణ నష్టమే కాక, బతుకు తెరువు కూడా కోల్పోయారు. మరోవైపు నుండి చూస్తే ఈ దాడులకు సమీకరించిన వారు, వాటిని నిర్వహించినవారు పెద్ద ఎత్తున లాభపడటమే కాక అధికారికంగా బలపడ్డ విషయం అర్థమవుతుంది.

## ముజఫర్ మారణ కాండ : రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం

గత ఏడాదిన్నరలో కాలంలో ఉత్తరప్రదేశ్‌లోని ఫయిజాబాద్, ప్రతాప్‌ఘుర్, బరేలి, మధుర, గజియాబాద్, కోశీకలన్, ఇంకా అనేక ప్రాంతాల్లో ముస్లింలపై నూటికి పైగా చిన్న పెద్ద దాడులు జరిగాయి. ఇవి కాక నమోదుకానివి ఎన్నో ఉన్నాయి. ఇవి ముందుగానే నిర్దేశించుకున్న దాడులు. ఎక్కడైనా ఒక్కటే కథ.

చిన్న ఘటనలను ఉపయోగించుకొని పెద్ద ఎత్తున యథేచ్ఛగా ముస్లింలపై, వారి జీవనాధారాలపై దాడులు జరపడం.

ముజఫర్‌నగర్ నుండి మా బృందం తిరిగి వచ్చేశాక బల్రామ్‌పూర్‌లో జరిగిన దాడిలో ఒక వ్యక్తి మరణించాడని తెలిసింది.

సమాజ్‌వాది పార్టీ ఉత్తరప్రదేశ్‌లో అధికారానికి వచ్చినప్పటి నుండి ముజఫర్‌నగర్ మారణకాండ ఆ రాష్ట్రంలో కొనసాగుతున్న దాడులకు ఒక చేర్పు మాత్రమే. కానీ, ముజఫర్‌నగర్‌లో జరిగిన దాడుల తీవ్రత వలన దానిని మిగిలిన వాటి నుండి వేరుచేసి చూడాల్సి వస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం దాడుల్లో 80 మంది చనిపోయారు. కానీ స్థానికుల అంచనా ప్రకారం 130 మంది చనిపోయి ఉంటారు. ఒక లక్షమంది జనాభా గ్రామాలను వదిలి ఇళ్ళకు దూరమయ్యారు. దాడులు సర్వత్రా వ్యాపించాయి. అధికారిక గణాంకాల ప్రకారమే భాగపట్, మీరట్, ముజఫర్‌నగర్, షామ్లి జిల్లాల్లోని 94 గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి.

వీటిని ఈవ్‌టీజింగ్ కారణంగా జరిగిన ఘర్షణ ఫలితంగా ఆగస్టు 27న సచిన్, గౌరవ్‌ల హత్యకు ప్రతిఘటనగా మాత్రమే జరిగిన అల్లర్లగా చూడలేము. అట్లాగే ఇవి హఠాత్తుగా సంభవించిన దాడులు కూడా కావన్నది స్పష్టం. ఈ దాడుల వెనుక గుజరాత్ మారణకాండ వలె పకడ్బందీగా రచించిన పథకం ఉంది.

ఆగస్టులో జరిగిన సంఘటన దాడులకు ప్రేరేపించిందని ప్రచారం జరుగుతున్నది కానీ నిజానికి జూలైలోనే జాట్ కులస్తులు మహా పంచాయితీని నిర్వహించి 12 గ్రామాల్లో ముస్లింలను సామూహికంగా బహిష్కరించాలని నిర్ణయించారు. అప్పటి నుండి ఈ దాడులకు సన్నాహాలు కొనసాగుతూ ఉన్నాయి. ఇటువంటి పంచాయితీల్లో బిజెపి స్థానిక కాప్ నాయకులతో సన్నిహితంగా పని చేస్తుంది. వారు స్థానికంగా ఫ్యూడల్ నాయకులు. వారి తక్షణ కర్తవ్యం ఎన్నికల్లో ఆశించిన ఫలితాల కోసం సమాజంలో అశాంతిని, అస్థిరతను రగిలించడం.

గత కొన్ని సంవత్సరాలుగా ఉత్తరప్రదేశ్‌లో సంఘ పరివార్ శక్తులు తమ కార్యకలపాలను ముమ్మరం చేసాయి. ఫలితంగా ముస్లింలపై దాడులు పెరిగాయి.

మోడీ ఎన్నికల ప్రచారం కోసం అమిత్‌షాను పార్టీ ఇన్‌చార్జిగా బిజెపి నియమించింది. అతని గత చరిత్ర చూస్తే మైనారిటీలపై దాడులు నిర్వహించడంలో ఆరితేరినవాడని అర్ధమవుతుంది. అతని నియామకం బిజెపికి మరింత కలిసి వచ్చింది.

ముజఫర్‌నగర్ దాడులకు పరిస్థితులు విషమిస్తున్న దశలోనే సిభేరా గ్రామంలో లక్ష మందితో సెప్టెంబరు 7న మహాకాప్ పంచాయితీ జరిగింది. బిజెపి నాయకుడు సంగీతా సోమ్, సాధ్వి ప్రాచి లాంటి వారు ముస్లింలకు వ్యతిరేకంగా విషపూరిత ప్రసంగాలు చేసారు. త్రిశూలాలు, కత్తులు, ఇతర మారణాయుధాలను పంపిణీ చేసారు. 'ముస్లిం పురుషుల కబంధ హస్తాల నుండి హిందూ స్త్రీల రక్షణ కోసం' అనే అంశం చుట్టూ ప్రసంగాలు సాగాయి. సచిన్, గౌరవ్‌లను అమరులుగా, 'వారు' స్త్రీల గౌరవం కోసం నిలబడ్డవారిగా అభివర్ణించారు. ఈ సమావేశాల్లో ధనికులే కాకుండా పేద జాట్‌లు కూడా పాల్గొని ప్రసంగాలకు ప్రభావితమయ్యారు. ముస్లింల నుండి హిందూ స్త్రీల రక్షణ అనే భావనతో పేద జాట్‌లు కూడా పెద్ద ఎత్తున సమీకరించబడ్డారు. ముస్లిం వ్యతిరేకత అనే ఒకే కారణంతో పేద జాట్‌లు, ఫ్యూడల్ నాయకులతో ఒకటయ్యారు. ఆర్థికంగా సామాజికంగా జాట్‌లలో చాలా మంది పేద ముస్లింలతో పాటు ఒకే రకమైన స్థితిలో ఉన్నా కూడా. తర్వాత పెద్ద ఎత్తున జరిగిన జన సమీకరణలో, దాడుల్లోనూ ఇదే ప్రతిఫలించింది. కొందరు స్థానికులు మాతో మాట్లాడుతూ 'మరిన పరిస్థితుల ఫలితంగా అధిక శాతం జాట్‌లు తమ రాజకీయ విశ్వాసాన్ని రాష్ట్రీయ లోక్‌దళ్ నుండి బిజెపి వైపు మార్చున్నారు.

దేశవ్యాపితంగా మైనారిటీలపై జరుగుతున్న దాడుల్లో పోలీసుల కుమ్మక్కు అధికారికంగా నిరూపించబడిన వాస్తవం. సమాజ్‌వాది పార్టీ ప్రభుత్వ హయాంలో కూడా ముజఫర్‌నగర్‌లో అల్లరి మూకలు పోలీసులతో కుమ్మక్కై దాడులకు పాల్పడ్డాయి. రాష్ట్ర, స్థానిక పాలనా యంత్రాంగం ఒకే ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ దాడులు ఎక్కడా ఆగలేదు. ప్రభుత్వం తలుచుకుంటే ఈ దాడులు నిరోధించబడేవి. సమాజ్‌వాది పార్టీ తనను తాను ముస్లింల 'మెసయ్య'గా అభివర్ణించుకుంటుంది. గత ఎన్నికల్లో ముస్లింల భద్రతకు, న్యాయానికి గొప్పగా హామీలిచ్చింది. వాస్తవానికి గ్రామాల్లో తమ ఎన్నికల విజయాలకు దోహదం

చేసేవి అగ్రకులాలు, పెత్తందార్లే కనక అన్ని ఎన్నికల పార్టీల వలె సమాజ్‌వాది పార్టీ కూడా వారిపైనే ఆధారపడి ఉంది. కాబట్టి దాడుల పట్ల ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరించి, జాట్‌ల ఓట్ల కోసం ముస్లింలను ఆపదలోకి నెట్టి వేయడంలో ఆశ్చర్యం లేదు. ఈ వాస్తవం బిజెపి / ఆర్ఎస్ఎస్ / విహెచ్‌పి లాంటి సంస్థలకు బాగా తెలుసు. ఈ దాడులకు సూత్రధారులైన బిజెపి బహిరంగంగానే సంగీత్ సోమ్ వంటి నమ్మినబంట్లను గౌరవించింది. నెలలు గడుస్తున్నా హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలకు పాల్పడిన వాళ్ళను ఉపేక్షిస్తున్నది సమాజ్‌వాదీ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వమే అన్న విషయాన్ని మరిచిపోకూడదు.

రయిసుద్దీన్ మాతో మాట్లాడుతూ (దంగపిడిట్ క్యాంపు ఇన్‌చార్జి - మలక్‌పూర్) 'గ్రామాల్లో స్వేచ్ఛగా తిరుగుతున్న నేరస్తులు తిరిగి దాడులు చేస్తారనే భయంతోనే బాధితులు వారి గ్రామాలకు తిరిగి వెళ్ళే ఆలోచనలు మానుకున్నారు' అన్నాడు. షాజిద్ సైఫ్ (అదే క్యాంపు) మాట్లాడుతూ 'ఎన్నికల ముందు తనకు తాను 'మౌలానా'గా అభివర్ణించుకొన్న ములాయం సింగ్ – మోడీకి ఏ విధంగానూ తీసి పోడు' అని చెప్పాడు. ఈ దాడులు 'బిజెపి, ఎస్.పిలు కలిసే చేసాయి. ములాయంసింగ్ క్యాంపుల్లో ఉన్న బాధితులను కాంగ్రెస్ ఏజెంట్లన్నాడని' అంటూ వివరించాడు. దాడుల్లో ఎస్.పి. ప్రభుత్వం ఎలా పాత్రధారి అయిందో లాక్ గ్రామస్తుడు ముస్తాకిన్ (మలక్‌పూర్ క్యాంపు) చెప్పాడు. పకడ్బందీగా జరిగిన ఈ మతోన్మాద దాడులలో సమాజ్‌వాది పార్టీ కుట్రపూరిత పాత్రను క్యాంపుల్లో నివసిస్తున్న వారు బహిర్గతం చేశారు.

ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వాలు ఎన్ని మారినా వాటి స్వభావంలో, పాత్రలో మార్పు లేదు. కొన్ని సంవత్సరాల క్రితం యోగి ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా కొంత మంది పౌర హక్కుల కార్యకర్తలు స్థానిక కోర్టులో కేసు వేశారు. స్థానిక ప్రజలను ముస్లింలకు వ్యతిరేకంగా తన విషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టి మతోన్మాదాన్ని ప్రేరేపించి వారిని మరింతగా దిగజార్చుతున్నాడనే అభియోగం అతనిపై మోపపడింది. ఆనాటి బహుజన సమాజ్‌వాది పార్టీ (బి.ఎస్.పి.) ప్రభుత్వం కీలక పాత్ర పోషించి అతనిపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్.ను క్వాష్ చేసి యోగి ఆదిత్యనాథ్ స్వేచ్ఛగా తన విద్వేష క్యాంపెయిన్ అప్రతిహతంగా

కొనసాగించేలా చేసింది.

కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా మొసలి కన్నీళ్ళు కారుస్తూ క్యాంపుల్లో బాధితులను పరామర్శించడానికి వస్తున్నారు. ఎస్.పి. మద్దతుదారులనేమైనా తమవైపు తిప్పుకోవచ్చేమేనని వారి ఆశ. మలక్‌పూర్ క్యాంప్ వద్ద రాహుల్ గాంధీ భారీ హోర్డింగులు, బ్యానర్లు ఇటువంటి పరిస్థితుల్లో కూడా నిస్సిగ్గుగా చేసుకునే ఎన్నికల ప్రచారాన్ని తెలియజేస్తున్నాయి. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ అధికారంలో ఉన్నా మైనారిటీలపై దాడులు కొనసాగిస్తూనే ఉంది. 2011లో రాజస్థాన్‌లోని గోపాల్‌నగర్‌లో 19 మంది ముస్లింలు, మహారాష్ట్రలోని ధూలేలో ఆరుగురు ముస్లింలు హత్యలకు గురయ్యారు. ఊచకోతలకు చట్టాలు శిక్షల భయం లేని భరోసానిచ్చింది ఆ పార్టీయే. ఆ పార్టీలోని స్థానిక నాయకులే ఊచకోతలకు దారితీసి కుఖ్యాతిగాంచిన మహా కాప్ పంచాయితీల్లో భాగమయ్యారు. కొన్ని నెలల క్రితం రాహుల్ గాంధీ, క్యాంపుల్లోని బాధితులు ఐ.ఎస్.ఐ ఏజెంట్లని అసహ్యాకరమైన ప్రకటన ఒకటి ఇచ్చాడు. ప్రజాస్వామిక, అభివృద్ధికాముకుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. అతని ప్రకటనకు బలం చేకూర్చేందుకా అన్నట్లు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు మలక్‌పూర్ క్యాంపు నుండి ఇద్దరిని అరెస్టు చేసి వారిపై లష్కర్-ఎ-తోయిబాకు రిక్రూట్ చేస్తున్నారనే అభియోగాలు మోపారు. మా నిజనిర్ధారణ కమిటీ ఢిల్లీ తిరిగి వచ్చాక కూడా ఢిల్లీ పోలీసులు ఆ క్యాంపుల చుట్టూ రౌండ్లు తిరుగుతున్నారని తెలిసింది.

మతోన్మాద దాడులు జరిగినప్పుడు, సెక్యులర్ పార్టీలని చెప్పుకొనేవి కూడా మెజారిటీ ఓటు బ్యాంకుకు దూరమవుతామనే ఉద్దేశ్యంతో పార్లమెంటులో కనీసం నోరు కూడా విప్పకుండా దుర్మార్గమైన మౌనం పాటిస్తాయి. ఏ పార్టీ పోయి ఏ పార్టీ వచ్చినా మతోన్మాదానికి వ్యతిరేకంగా ఏ విధంగానూ పోరాటం చేయలేదని గత 65 సంవత్సరాల అనుభవం చెబుతోంది. మైనారిటీలను మరింత వెనక్కు నెట్టే సామాజిక క్రమమే ఈ పార్టీలన్నీ పాటించాయనేది ఈ దాడుల తీవ్రత ద్వారా తెలుస్తోంది.

## ముజఫర్‌నగర్ మారణకాండ వెనుక ఉన్న ఆర్థిక రాజకీయ పరిస్థితులు

ముజఫర్‌నగర్ వంటి ప్రాంతాల్లో ముస్లింలపై కొనసాగుతున్న హింస

తాత్కాలిక ఎన్నికల రాజకీయ ప్రయోజనాల పరిధిని దాటి ఆ సమూహాన్ని మొత్తంగా పరాయీకరించి, సామాజపు చివరి అంచులకు నెట్టివేసి అణగదొగ్గే క్రమంగా జరుగుతున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పశ్చిమాన విశాల భూభాగం ఉన్న ప్రాంతం ముజఫర్‌నగర్. ఈ ప్రాంతంలో అతిపెద్ద సామాజిక వర్గం జాట్‌లు. హరిత విప్లవం ద్వారా బాగుపడింది వీరే. ఆ తర్వాత క్రమంలో అతి పెద్ద భూస్వాములుగా అవతరించారు. రాజకీయంగా ఆధిపత్య వర్గాలు కూడా వీరే. గ్రామ పంచాయితీలు, స్థానిక పాలన వీరి చేతుల్లోనే ఉంటుంది. పోలీసులు కూడా వీరి ఆధీనంలోనే ఉంటారు. మధ్యయుగాల నుండే కాప్ పంచాయితీలు ఈ ప్రాంత ప్రజలను శాసిస్తున్నాయి. జాట్‌లలో 85 శాతం సొంత భూములున్న రైతులున్నారు. ముస్లింలు నిరుపేదలు. అత్యధిక శాతం భూమి లేని వారు. అతి కొద్ది శాతం ముస్లింలకు కొద్ది పాటి భూమి మహా అంటే ఒకటిన్నర బిగాలు (ఒక బిగా అంటే హెక్టారులో పావు వంతు) కన్నా మించకుండా ఉంది.

జాట్‌ల భూముల్లో ముస్లింలు దిన కూలీలుగా పనిచేస్తారు. జాట్‌లే వడ్డీ వ్యాపారస్తులు. ఇటుక బట్టీల్లో, నిర్మాణ పరిశ్రమల్లో ముస్లింలే ఎక్కువ మంది పనిచేస్తుంటారు. కొన్ని దశాబ్దాల వరకు ముస్లింలలోని పెద్ద సెక్షన్, హాండ్‌లూమ్ పరిశ్రమల సొంతదారులుగానో, అందులో పని చేసేవారుగానో ఉండేవారు. ఎక్కువగా నూలు దారాన్ని ఉత్పత్తి చేసేవారు. ప్రభుత్వ సామ్రాజ్యవాద దిగుమతి పాలసీల ఫలితంగా ఇటువంటి చిన్నా చితక నూలు పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున ముస్లింలు దివాళా తీసి వడ్డీ వ్యాపారస్తులైన జాట్‌ల కబంధ హస్తాల్లో చిక్కుకున్నారు.

## కుర్మల్ గ్రామ దినకూలీ మహమ్మద్ దిల్‌షాద్ వాఙ్మూలం (నూర్‌పూర్ ఖుర్‌గమ్ క్యాంపులో శరణార్థి)

మా గ్రామ జనాభా 4000–5000 మధ్య ఉంటుంది. అందులో ముస్లిం కుటుంబాలు పది పదిహేను దాకా ఉన్నాయంతే. సెప్టెంబరు 7–8న అర్ధరాత్రి మా సమీప గ్రామంలో దాడుల గురించి విన్నాక మమ్మల్ని మేం కాపాడుకోవడానికి దగ్గర్లోని పొలాల్లోకి పారిపోయి తర్వాత ఈ క్యాంపుల్లోకి వచ్చాం.... రెండు లేదా మూడు ఇళ్ళను వందలాది మంది చుట్టుముట్టితే ఏం చేయగలం? గ్రామ

ప్రధాన్ (గ్రామ పెద్ద) మమ్మల్ని తిరిగి గ్రామానికి రమ్మని, భద్రత కల్పిస్తానన్నాడు. రెండు కుటుంబాల వాళ్ళు వెళ్ళగానే జాట్లు మిమ్మల్ని కాల్చివేయడానికి పెట్రోలు డబ్బాలు ఆయుధాలతో వస్తున్నారని చెప్పి పోలీసులు భయపెట్టారు. రెండు గంటల తర్వాత వాళ్ళ ఇళ్ళకు నిప్పుపెట్టారు. ముస్లింలు తిరిగి రావడం చూసి జాట్‌లు సమావేశమవుతారు. గ్రామాలకు రాకుండా భయపెడతారు. అట్లా వెళ్ళిన వాళ్ళంతా తిరిగి క్యాంపులకు వచ్చేశారు. ఇప్పుడు మేము మా ఊర్లకు పోవాలనికూడా అనుకోవడం లేదు. ఏమైనా జరిగితే ఫోన్ చేయమని పోలీసులంటారు కానీ వాళ్ళెప్పుడూ రెండు గంటలు ఆలస్యంగా వస్తారు. వాళ్ళు మాకు రక్షణ అని ఎలా భావించగలం? మేము ఏ పరిస్థితిలోకి దిగజారామంటే పభుత్వం కూడా మాకోసం ఏమీ చేయాలనుకోవడం లేదు. ఇళ్ళు, పశువులు, ఇంకా మాకున్నవన్నీ వదిలేశాం. అవి ఇంకా అక్కడే ఉన్నాయా? చూసుకోడానికి కూడా తిరిగి గ్రామాలకు వెళ్ళలేం.

మాలో దాదాపు అందరూ దిన కూలీలే. జాట్‌ల పొలాల్లో పనిచేస్తాము. కొంతమంది భవన నిర్మాణ పనుల్లో ఉండే వాళ్లు. ఎవరైనా జాట్ నుండి అప్పు తీసుకుంటే చాలా ఎక్కువ వడ్డీ చెల్లించాలి. 2003లో నేను 40,000 రూపాయలు అప్పు తీసుకున్నాను. 2006 సంవత్సరం నాటికి 1,80,000 చెల్లించాలి. కానీ, 1,00,000 రూపాయలు మాత్రమే చెల్లించగలిగాను. మిగిలిన బాకీకి నా ఇంటిని యిమ్మని ఒత్తిడి చేసారు. అప్పులు తీసుకున్న వాళ్ళు వారి పొలాల్లో పని చేయాలి. సంవత్సరానికి రెండు పంటలు తీస్తారు. కూలీలకు 1/4 వంతు పంటను కూలీగా యిస్తారు. అందులోనే కొంత అప్పుకింద జమ చేసుకుంటారు. దీంతో చాలీ చాలని కూలీతో కనీస అవసరాలు తీరవు. మళ్ళీ అప్పులు, కట్టు బానిసత్వం. మా వాళ్ళంతా ఈ విషవలయంలో విలవిల్లాడుతుంటారు. 2008 సంవత్సరంలో నాకు పాణిపట్టులో పని దొరికింది. నా కుటుంబంతో కలిసి వెళ్ళాలనుకున్నాను. అప్పు తీర్చకుండా వెళ్ళకూడదన్నారు. కావాలంటే మరింత అప్పు యిస్తాం అన్నారు. కానీ, వడ్డీ తడిసి మోపెడు అవుతుంది. నెలవారీ చెల్లించాలి. తిరిగి చెల్లించడానికి వీల్లేనంతంగా అది పెరిగిపోతుంది. ఇటువంటి పరిస్థితులు కల్పిస్తారు వాళ్లు.

అక్కడ సామాజికంగా ఆధిపత్య వర్గం జమిందార్లైన జాట్లు. జాట్లలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ డబ్బులు వడ్డీకిస్తుంటారు. ముస్లింలు, జిమార్లు (ఆ

ప్రాంతంలో ఒక కులం), చముర్లు (దళితులు) ఆ ప్రాంతంలో అధిక సంఖ్యలో కూలీలుగా ఉన్నారు. ముఖియా, ప్రధాన్ లేదా సర్పంచ్ వంటి ముఖ్యమైన పదవులన్నిటిలో జాట్‌లే ఉన్నారు. ఒక్క ముస్లిం కూడా పొరపాటునైనా ఈ పదవుల్లో ఎప్పుడూ లేరు. స్థానిక పాలనా సంస్థల్లోనూ, కాప్ పంచాయితీల్లోనూ ఆధిపత్యమంతా జాట్ కులస్తులదే. ప్రభుత్వ యంత్రాంగమంతా వారిదే. కనుక వాళ్ళేది చేయాలనుకుంటే అది చేస్తారు. పోలీసులను తమ గుప్పిట్లో ఉంచుకుంటారు. ఎవరినైనా, ఎటువంటి కారణం లేకుండా అరెస్టు చేయించగలరు. ప్రభుత్వ అధికారులు ప్రజలను ఎప్పుడూ కలుసుకోరు. జమిందార్లను మాత్రమే కలిసి వారు చెప్పే విషయాలను బట్టి నివేదికలు ఇస్తారు. జాట్‌లు అప్పట్లో అజిత్‌సింగ్‌కు మద్దతు ఇచ్చేవారు. ప్రస్తుతం బిజెపి వైపున్నారు. అక్కడ మహా పంచాయితీ బిజెపి ఆధ్వర్యంలోనే జరిగింది.

ఎన్నికల్లో పెత్తందార్ల మాట ప్రకారం గ్రామస్తులు ఓటెయ్యాలి. వినని వాళ్ళని చిత్రహింసలు పెడ్తారు. వాళ్ళ మాట కాదని వేరెవరికైనా ఓటేస్తున్నారని ఎవరిపైనైనా అనుమానం వస్తే, ఆపేసి వారే ఓట్లు గుద్దుకుంటారు. గ్రామంలో వారి శాసనం అమలుకావాల్సిందే. ఉదాహరణకు ఒక నియోజక వర్గంలో 100 ఓట్లు ఉంటే జాట్‌లు చెప్పిన పార్టీకి ఆ ఓట్లన్నీ వేయాల్సిందే. కూలీలంతా కట్టుబానిసలు. రోజంతా కూలీ తప్ప ప్రభుత్వం అంటే ఏమిటో మా అనుభవంలో లేదు. గ్రామంలోని స్కూళ్ళో ఓట్లు వేయాలని మాత్రమే తెలుసు. అక్కడ కూడా ఎవరికి వేయాలో వారే నిర్ణయిస్తారు. ఎన్నికలప్పుడు తియ్యని మాటల్తో ఓట్లడుగుతారు. అధికారంలోకి రాగానే ఏమీ పట్టించుకోరు.

2003 ఎన్నికల్లో ఆ ప్రాంతంలో హుకుమ్‌సింగ్ పోటీ చేస్తున్నప్పుడు అతని నమ్మినబంటు మా నాన్న వద్దకు వచ్చి మీ బస్తీలో ముస్లిం ఓట్లన్నీ హుకుమ్‌సింగ్‌కే వేయాలి. అలా చేస్తే పది వేల రూపాయలు ఇస్తామని చెప్పాడు. మా నాన్న, వాళ్ళిష్టం వచ్చినట్లు వేస్తారు అని ఆ డబ్బు తీసుకోలేదు. గ్రామమంతా మా నాన్నను ఎక్కడా కూర్చోనివ్వకుండా బహిష్కరించింది. ఒక సంవత్సరం పాటు ఇదంతా కొనసాగింది. ముస్లింలు ఎప్పుడైనా కొత్త బట్టలు వేసుకుంటే వారిని అసభ్య పదజాలంతో దూషిస్తారు. 'ఎక్కడికి పోతున్నావురా సువ్వర్. పెద్ద నాయకుడై పోయావే' అంటారు. వాళ్ళ మాట పడకుండా కొత్త బట్టలు కూడా వేసుకోలేమంటే

ఊహించండి. ఇంక స్వేచ్ఛగా బతకడం అంటే ఏమిటో మా అనుభవంలోనే లేదు.

కఠినమైన పరీక్షా సమయంలో ఉన్నాం. క్యాంపుల్లో సమస్యలు ఉన్నప్పటికీ పిల్లలు మాతోనే ఉన్నారనే ఊరట ఉంది. గ్రామంలో అయితే ఉదయం 4 గంటలకే నిద్రలేచి పనులకు పోయే వాళ్ళం. ఇక్కడ కూడా కూలీ పనే గానీ పని అయిపోగానే డబ్బులు తీసుకుంటున్నాం. గ్రామాలకు పోతే అన్నం తినేటప్పుడు కూడా పనులకు తీసుకొని పోతారు. మేము ఎలా ఆ గ్రామంలో బతకాలి? ఇక్కడా సమస్యలే కానీ, రాత్రి నిద్రపోయేటప్పుడు కనీసం భయం లేకుండా అయినా గడుపుతున్నాం. అక్కడైతే డబ్బులు తీసుకోవాలంటే ఎంతో కాలం ఆగాలి. లేదా అత్యవసరం అంటూ ఏదో జబ్బులాంటి కారణం చెప్పాలి. ఈ క్యాంపులు మా పాలిటి స్వర్గంలా ఉన్నాయి. గ్రామాలకు పోతే ఎప్పుడైనా పొరపాటున వారితో పాటే కూర్చుంటే 'పందీ, ఎక్కడరా కూర్చున్నావు?' అంటూ కేకలు వేస్తారు.

ముజఫర్‌నగర్ దాడులను, జరిగిన కాలాన్ని పరిశీలిస్తే చాలా సంక్లిష్టంగా ఉంటుంది. ముస్లింలపై దాడులు చెరుకు పంట కోతకు వస్తుందనగా మొదలయ్యాయి. ఈ ప్రాంతంలో ఈ పంటే ప్రధానమైంది. సంఘ పరివార్‌తో అనుబంధం ఉన్న జాట్ భూస్వాములు కూలీలు అవసరమైనప్పుడు వేలాది మంది ముస్లింలను తరిమికొట్టారు. ఇది చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. అర్ధభూస్వామ్య వ్యవస్థ నేపథ్యంగా ఉన్న మన భారతదేశంలో వ్యవసాయోత్పత్తి కంటే ఆధిపత్యానికే అధిక ప్రాధాన్యం ఉంటుంది. పరాన్నభుక్కులైన భూస్వాములు భూమిపై ఆధిపత్యం ఫలితంగా అధికారాన్ని, ఆధిపత్యాన్ని, ఆదాయ వనరులను పొందుతున్నారన్నది వాస్తవం. స్థానికుల సమాచారం మేరకు దాడులు జరిగిన తర్వాత వారి వస్తు సామాగ్రిని తెచ్చుకోవడానికి తిరిగి గ్రామాలకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఇక వారి భూములు, ఇళ్ళు అన్నింటినీ గ్రామంలోని పెత్తందారీ వర్గాలే ఆక్రమించాయి. స్థానిక కార్యకర్తల సమాచారం ప్రకారం సహాయ శిబిరాల పాలైన వారిలో కేవలం 10 శాతం ముస్లింలు మాత్రమే భూములు కలిగి ఉన్నారు. ఇవి కూడా భూస్వాముల వేలాది ఎకరాల భూముల్లో కలిసిపోయాయి. ఒక్క లాయ్ గ్రామంలోనే ముస్లింలు 2300 బిగాల భూములు వదిలి వెళ్ళారు.

(దీప్తిమాన్ తివారి ముజఫర్‌నగర్ దాడుల తర్వాత భూముల యాజమాన్యం ఎలా మారిందో టైమ్స్ ఆఫ్ ఇండియా (సెప్టెంబరు 19, 2013)లో వివరించారు). దాడుల తర్వాత జాట్‌లు ఒక పిలుపునిచ్చారు... “ఎవరు పంట పెట్టుకుంటారో వారిదే భూమి.” ముస్లింలు పంటపెట్టుకుండా వదిలిపెట్టిపోయిన వారి చిన్న కమతాల భూములు ఇక ఆధిపత్య జాట్ వర్గాలకే దక్కినట్లు.”

రైసుద్దీన్ (మలక్‌పూర్ రిలీఫ్ క్యాంపు ఇన్‌చార్జి) మాటల్లో “కొద్దిపాటి ముస్లింల భూములను, ఇళ్ళను, శ్మశానాన్ని, మసీదులు, మదరస్సాలను అన్నింటిని జాట్‌లు ఆక్రమించారు.” ముస్లింలను గ్రామం నుండి బలవంతంగా పారిపోయేటట్టు చేసాక లిషాద్ గ్రామంలో 35 బిగాల శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారని అతను చెప్పుకొచ్చాడు. రథోడా గ్రామానికి చెందిన మరో మహిళ తన కుటుంబానికి మూడు ఇళ్ళు ఉండేవని, కానీ ప్రాణాలకే ముప్పుందంటే ఇక ఇళ్ళు ఉండి ప్రయోజనం ఏమిటని అన్నది.

ఆర్థికంగా బాగా బలిసిన స్థితిలో ఉన్న జాట్‌లు ఈ దాడుల ద్వారా ఉద్దేశపూర్వకంగా ముస్లిం కుటుంబాలను మరింత పతనం చేసి, సామాజికంగా, ఆర్థికంగా కోలుకోలేని విధంగా దెబ్బతీసారు. అల్లరి మూకలు చిన్న చిన్న షాపులు, వ్యాపారులను సైతం లక్ష్యం చేసుకొని దాడులు చేసాయి. మా బృందం పర్యటనలో ఒక క్యాంపులో చెప్పుల దుకాణం యజమానిని కలిసాం. దాడుల క్రమంలో ఆయన చెప్పుల దుకాణాన్ని తగులబెట్టారు. గ్రామస్తులను భయాందోళనకు గురిచేసి పారిపోయేలా చేసారు. ఈ దాడులు దోపిడీని మరింత తీవ్రం చేయడానికి పునాదిని ఏర్పరిచాయి. ఈ దాడుల ఫలితంగా ముస్లింలు 20 సంవత్సరాలు వెనక్కు నెట్టబడ్డారని సాజద్ సైఫ్ (మలక్‌పూర్ క్యాంపు) పేర్కొన్నాడు. క్యాంపుల్లో ఉన్న బాధితులంతా తీవ్రమైన నిరాశతో కొట్టుమిట్టాడుతున్నారు. సర్వస్వం కోల్పోయిన వారిని ఇదివరకంటే అతి తక్కువ వేతనాలతో కాంట్రాక్టర్లు పనికి కుదుర్చుకుంటున్నారు.

ఈ దాడులు పెద్ద ఎత్తున ముస్లింల విస్థాపనకు కారణమయ్యాయి. బలంగిర్, ధర్మపురి లేదా హర్యానాలోని అనేక ప్రాంతాల్లో దళితులపై ఇటీవల జరిగిన దాడులకు ముజఫర్‌నగర్ దాడులకు ఆ విధమైన సారూప్యం ఉంది. బాధితులు పెద్ద ఎత్తున ఊర్లొదిలి వెళ్ళిపోవడంతో జనాభాలో మార్పులొస్తున్నాయి. ఫుగాన

లాంటి గ్రామంలో అయితే ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. ఒక వార్తా పత్రిక కథనం ప్రకారం గత సంవత్సరం ముస్లింలు వదిలిన ఇళ్ళకు జాట్‌లు తాళాలు వేసుకున్నారు. ఇటు వంటి పరిణామాలు కొన్ని వర్గాలకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. అంతకన్నా ముస్లింలు పెద్ద ఎత్తున ఊర్లొదిలి వెళ్ళిపోవడం వల్ల ముజఫర్‌నగర్ చుట్టుపక్కల ఫ్యూడల్ వర్గాలు ఇంకా అధికారం పెంచుకున్నాయి. పార్లమెంటరీ పార్టీలన్నీ ఇటువంటి కుల, మతోన్మాద ఫ్యూడల్ వర్గాలకే దాసోహం అంటున్నట్లే సమాజ్‌వాది పార్టీ దీనికి భిన్నంగా ఉండదు. ముస్లింలు తిరిగి గ్రామాలకు వచ్చి ఉండటానికి సురక్షితమైన వాతావరణం, రక్షణ కల్పించడం పోయి గ్రామాలు వదిలి వెళ్ళినవారు తమ భూములు, ఆస్తుల గురించి మరిచిపోవాలని చెప్తోంది. ప్రభుత్వమే జనాభా దామాషాను మార్చివేస్తోంది.

గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం దాడుల్లో నష్టపోయిన వారికి ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామనే ప్రకటనలు పెద్ద ఎత్తున గుప్పించింది. కానీ, క్యాంపుల్లో ఉన్న బాధితులు చెప్పిందేమంటే ఇంత వరకు ఎటువంటి పరిహారం ప్రభుత్వం ఇవ్వలేదు. ఎవరికో ఒకరికి పరిహారం అందినప్పటికి, అది వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టేందుకు ఒక రాజ మార్గంగా ఉపయోగపడింది. పరిహారానికి బదులుగా వాళ్ళు తమ గ్రామాల్లోని ఇళ్ళు, భూములపై హక్కులు వదులుకోవాల్సిందే. నష్టపరిహారంలోని మొదటి అంశం చూస్తే ప్రభుత్వం ఇంట్లో ఒకరికి నష్టపరిహారం ఇస్తే మిగిలిన వారందరినీ బలవంతంగా క్యాంపుల నుండి వెళ్ళగొట్టాలనే ఉద్దేశ్యం కనబడుతుంది. (ఉమ్మడి కుటుంబాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది)

ఉదాహరణకు ముస్తాకిన్ (మలక్‌పూర్ క్యాంపు) మాట్లాడుతూ, అతని తండ్రికి పరిహారం ఇస్తే అతను, అతని సోదరుడు కూడా (వారికి వారి సొంత కుటుంబాలు, పిల్లలున్నారు) వెళ్ళిపోవాలట. అతని మాటల్లోనే "రెండు రోజుల క్రితం ప్రభుత్వ అధికారులు వచ్చి మీ నాన్నకు నష్టపరిహారం ఇచ్చాం, మీరు వెళ్ళిపోండి అని బలవంతం చేసారు. 'మేం ఎక్కడికి వెళ్ళాలి. పిల్లలున్నారు కదా' అని అడిగితే 'పోండి, సమీప అడవుల్లోకి పోయి బతకండి' అన్నారు. మేం ఎక్కడికి పోవాలి వేరే దేశానికా?"

ఇక రెండో అంశానికి వస్తే ఎవరు పరిహారం తీసుకుంటారో వారు ఒక

అఫిడవిట్‌పై సంతకం చేయాలి. అందులో ఏముందంటే 'గ్రామాలకు తిరిగి వెళ్ళము. ఇక తిరిగి ఎటువంటి నష్టపరిహారం డిమాండు చేయము. స్థిరాస్తులకు సంబంధించి నష్టాలకు కూడా పరిహారం అడగము.' అంటే ప్రభుత్వం కూడా ఆ ప్రాంతంలో ముస్లింల ఆస్తులు దోచుకోవడంలో పెత్తందారీ కుల మతోన్మాద ఫ్యూడల్ వర్గాలకు వత్తాసుగా నిలబడిందని ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టమైయింది. ప్రభుత్వ యంత్రాంగం ఈ విధమైన పద్ధతులను పాటించడం వల్ల పకడ్బందీగా ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపరిచి ఇటువంటి దాడులను అరికట్టడం కాకుండా మళ్ళీ మళ్ళీ పునరావృతం అయ్యే అవకాశాన్ని అది కల్పించిందని నొక్కి చెప్పవచ్చు.

ముజఫర్‌నగర్ మారణకాండ తేటతెల్లం చేసిందేమంటే మైనారిటీలపై గత కొద్ది దశాబ్దాలుగా పట్టణాలకే పరిమితమైన మతోన్మాద ఫాసిస్టు దాడులు ఇప్పుడు పెద్ద ఎత్తున పల్లెలకు బదిలీ అవుతున్నాయి. ప్రస్తుతం దేశంలో తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం ప్రభావాన్ని గ్రామీణ ప్రాంతాలు కూడా చవిచూస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా ఒకే స్థాయిలో ఉన్న విభిన్న మతాల, కులాల ప్రజల మధ్య పెరుగుతున్న సంఘీభావాన్ని దెబ్బ తీయడానికి భూస్వామ్య వర్గాలు ఇలాంటి దాడులను ఒక సాధనంగా ఎంచుకుంటాయి.

ముజఫర్‌నగర్‌లో ముస్లింలపై దాడులు ఒక ప్రత్యేకమైన అంశం కాదు. బీహారు, రాజస్థాన్ ఇంకా అనేక ఇతర ప్రాంతాల్లో ఇటువంటి తరహా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇటువంటి కుల – కమ్యూనిటీ ఆధారిత ధనిక వర్గాల కలయికను నాశనం చేసి మెజారిటీ సామాజిక గ్రూపులు, అణిచివేయబడ్డ ప్రజల మధ్య సంఘీభావం కోసం ప్రయత్నం చేయాల్సిన ముఖ్యమైన కర్తవ్యం ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులపై ఉంది. ఇందు కోసం మతోన్మాదం – సెక్యులరిజం మధ్య భావజాల రంగంలో జరగవలసిన పోరాటంతో పాటు ఏ సామాజిక సంబంధాలైతే ఇటువంటి దాడులకు పునాదిగా ఉన్నాయో అటువంటి వాటిని చురుకుగా మార్చి ప్రజాస్వామికీకరించాలి.

## ముగింపు

గత కొన్ని నెలల వరకు బాధితులంతా గ్రామాల్లో రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేసారు. ఈ దాడుల వెనుక వ్యూహకర్తలు, నేరస్తులను అరెస్టు చేసినట్లయితే ముస్లింలు గ్రామాలకు తిరిగి వెళ్ళగలరు. కానీ, ఈ దాడులకు కారకులైన వారు గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ రోజు వరకు వారిపై చట్టపరమైన చర్యలేవీ లేవు. కొందరు అరెస్టు అయినా వాళ్ళంతా బెయిల్‌పై విడుదలయ్యారు.

రక్షణ కల్పించాలనే డిమాండు ఇప్పుడు బలహీన పడింది. కేవలం పునరావాసం మాత్రమే బాధితులు అడుగుతున్నారు. వారు గత కొన్ని నెలలుగా క్యాంపుల్లో దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. ఎటువంటి సౌకర్యాలు లేక, సహాయం అందక, వర్షాల్లో తడుస్తూ, గడ్డకట్టే చలిలో ఇప్పటికే 30 మంది పిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ములాయం చెవిలో ఇవేవి పడవు. ఆయన దృష్టిలో క్యాంపుల్లో తలదాచుకున్నవారంతా కాంగ్రెస్ ఏజెంట్లే. బాధితులను బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నంలో ఉంది ప్రభుత్వ యంత్రాంగం.

బాధితులు మరోదారి లేక కేవలం ఆ క్యాంపుల్లో ఉండనిస్తే చాలు అనే స్థితికి వచ్చారు. ఈ క్యాంపులోనే సాజద్ సైఫి తన ఐదు నెలల పసికందును నవంబరులో నిమోనియా జ్వరంతో పొగొట్టుకున్నాడు. "మాకు ఇళ్ళు లేవు. డబ్బులు లేవు. ఎక్కడికి వెళ్ళగలం? రోడ్ల మీదికా" అని వేదనతో అతను ప్రశ్నిస్తున్నాడు.

అసమానత, అణిచివేత, అన్యాయంతో కూడిన ఈ వ్యవస్థ – శవాలను తొక్కుకుంటూ అభివృద్ధి – దేశ నిర్మాణం అనే చక్రాల కింద మానవ గౌరవాన్ని అణగదొక్కుకుంటూ 'అభివృద్ధి' చెందుతోంది. ఈ వ్యవస్థ మైనారిటీ వర్గాలను, బడుగు బలహీన వర్గాలను రాజకీయంగా, ఆర్థికంగా బలహీనపరుస్తూ శాశ్వతంగా అణిచివేస్తోంది. మతోన్మాద – ఫ్యూడల్ శక్తులకు శిక్ష లేకుండా మినహాయింపులు ఇచ్చి దాడులను పునరావృతం చేయనిస్తూ బలహీన వర్గాలు మరింత బలహీనపడేలా చేస్తున్నాయి. ముజఫర్‌నగర్ దాడులు ఇందుకు ఒక బలమైన ఉదాహరణ.

ఈ సందర్భంగా మనం ఏ ఉత్పత్తి సంబంధాలైతే అణిచివేతను కొనసాగిస్తాయో ఆ భౌతిక పరిస్థితులను మార్చకుండా ఈ అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయలేమని గుర్తుంచుకోవాలి. అణగారిన వర్గాలన్నీ కలిసి ఐక్యమై ప్రస్తుత కరుడు కట్టిన సమాజంలో విప్లవాత్మక పరిణామం కోసం, అసమాన సామాజిక క్రమానికి వ్యతిరేకంగా పోరాడాలి. అప్పుడే ఇటువంటి దాడులు ఆగిపోతాయి. అప్పుడే అణగారిన ప్రజానీకం సమానత్వంతో, ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతకటం సాధ్యమవుతుంది.